క్లుప్తంగా

గరికపాడు చెక్‌పోస్ట్ పరిశీలన



గరికపాడు(జగ్గయ్యపేట): ఏపీ–తెలంగాణ సరిహద్దుగల గరికపాడు చెక్‌పోస్ట్‌ను రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ శ్రీరాం మోహన్ మిశ్రా శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, మద్యం అక్రమ రవాణా సాగకుండా చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ ఉన్నారు.

సొంతూళ్లకు ఓటర్లు



కీసర(కంచికచర్ల) :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు సొంతూళ్లకు తరలివస్తున్నారు. విద్య, ఉపాధి రీత్యా హైదరాబాద్‌లో ఉంటూ సొంతూళ్లకు తరలివచ్చే వారి వాహనాలు కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం బారులుదీరారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారంతా స్వస్థలాలకు బయలుదేరి వస్తుండటంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. సొంత వాహనాలతో వెళ్లే వారితో నేషనల్ హైవేపై పలుచోట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. పోలింగ్ సోమవారం కావడంతో శనివారం వేకువజాము నుంచే హైవేపై భారీ రద్దీ ఏర్పడింది. ఆయా వాహనాలు హైద్రాబాద్ వైపు నుంచి నందిగామ, కీసర విజయవాడ మీదుగా విశాఖపట్నం, గుంటూరు, రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నాయి. కీసర టోల్‌ప్లాజా నుంచి ప్రతిరోజూ సుమారు 7వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, శనివారం సాయంత్రం వరకు అదనంగా మరో ఏడు వేల వాహనాలు వచ్చాయని టోల్‌ప్లాజా మేనేజర్ జయప్రకాష్ తెలిపారు. అదేవిధంగా శని, ఆదివారాల్లో రాత్రి సమయంలో బస్సుల ద్వారా ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు : ఆర్వో



నందిగామ: నియోజకవర్గంలోని 222 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లతోపాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవీఆర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లోని ఈవీఎంలను ఆదివారం ఉదయం 8 గంటలకు బయటకు తీసి సిబ్బందికి అప్పగిస్తామన్నారు. నియోజకవర్గాన్ని 23 సెక్టార్లు, 25 రూట్‌లుగా విభజించినట్లు తెలిపారు. ఆయా రూట్‌లలో ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు, మినీ బస్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌కు అనుమతిలేదన్నారు. ఓటర్లంతా ఈ విషయాన్ని గమనించి వారి ఫోన్లను పోలింగ్ కేంద్రంలోకి తీసుకురావద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు వేయడంతోపాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ఓటర్లంతా తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్వో కోరారు.

వజ్రకుమారి సేవలు ప్రశంసనీయం

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ ఆస్పత్రిలో శనివారం అంతర్జాతీయ నర్సింగ్ డే నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు సీనియర్ నర్సు పి.వజ్రకుమారిని ఘనంగా సత్కరించి ఆమె సేవలని కొనియాడుతూ యాజమాన్య అవార్డును అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ప్రసన్నవాణి, ఏఓ సుబ్బారావు, డాక్టర్ కల్యాణి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నందిగామ నియోజకవర్గ ప్రజలకు కలిగిన మేలును గమనించి, ఈ ఎన్నికల్లో అందరూ తమకు అండగా నిలవాలని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కోరారు. నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం వాకర్స్‌ను కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మంచి జరిగిందన్నారు. మంచి జరిగింది అని భావిస్తేనే ఓటేసి గెలిపించాలని చెబుతున్న దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఐదేళ్ల పాలనలో నందిగామను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామన్నారు. గడిచిన 25 ఏళ్లుగా జరగని అభివృద్ధిని ఈ ఐదేళ్లలో చేసి చూపించామని తెలిపారు. నందిగామలోని ఏ వీధికెళ్లినా మార్పు కనిపిస్తోందని..తాముచేసిన అభివృద్ధి పనులు కళ్లకట్టినట్లు కనిపిస్తున్నాయని వివరించారు. ప్రజల పూర్తి మద్దతుతోనే ఈ స్థాయిలో అభివృద్ధి చేయగలిగామని, మరోమారు అవకాశం కల్పిస్తే నందిగామను మరింత అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు సైతం రూపొందించినట్లు తెలిపారు. అనంతరం వాకర్స్‌తో కలిసి తేనీటిని సేవించారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నందిగామ ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, దేవదాసు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, మన్నెం దాసు, పిల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



డాక్టర్ జగన్‌మోహనరావును సత్కరిస్తున్న మహిళ



జగన్‌మోహనరావుతో ఫొటో దిగుతున్న చిన్నారి, మహిళలు

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వస్తేనే మహిళా సంక్షేమం కొనసాగుతుందని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమలాభాను అన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సామినేని ఉదయభానును గెలిపించాలని కోరుతూ ఆయన కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సాయంత్రం పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాతపేట గడ్డ నుంచి ర్యాలీగా బయలుదేరి బంగారు కొట్ల సెంటర్, బలుసుపాడు సెంటర్, నెహ్రూచౌక్, రైతుబజారు కూడలి, పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, బస్టాండ్ సెంటర్ మీదుగా కమలాసెంటర్ వరకు ప్రధాన వీధుల్లో పాదయాత్ర చేస్తూ ప్రచారం చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్లను సందర్శించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఉదయభానును, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా విమలాభాను మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతోనే అమలు చేశారని గుర్తుచేశారు. మరలా జగనన్న పాలన వస్తేనే మహిళల సంక్షేమం కొనసాగుతుందని వివరించారు. అందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. ప్రచారంలో ఉదయభాను కుటుంబసభ్యులు చాముండేశ్వరి(బేబి), పద్మ ప్రియాంక, కావ్య, ప్రజ్ఞ, పేట మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత విజిత, జెడ్పీటీసీ సభ్యురాలు ఊట్ల నాగమణి, మున్సిపల్ కౌన్సిలర్ కాశి అనురాధ, మాజీ కౌన్సిలర్ తుమ్మల వెంకటనాగమణి, ఇంటూరి శ్రీలత, ప్రోగ్రా కోఆర్డినేటర్ సలాది సూరిబాబు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు



జగ్గయ్యపేట ఎన్నికల ప్రచారంలో ప్రజలకు



ఓట్లు అభ్యర్థిస్తున్న మహిళా నాయకులు

వైఎస్సార్ సీపీలోకి 50 కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, మారెళ్ల విజయనరసింహారెడ్డి

పెనుగంచిప్రోలు: అందరికీ మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ వెంట తాము నడుస్తామంటూ గ్రామంలోని తూర్పు బజారు, చెరువుకట్ట సెంటర్‌కు చెందిన 50కుటుంబాలవారు శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, యూత్ నాయకులు మారెళ్ల విజయనరసింహారెడ్డి సమక్షంలో టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రవికుమార్, విజయనరసింహారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, నాయకులు పచ్చల శివప్రసాద్, కోటిరెడ్డి, కన్నేటి వెంకటరమణ, సుంకర అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

వీరులపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే మంచి జరుగుతుందని ప్రజలు పూర్తిగా నమ్ముతున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. వీరులపాడు గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి శనివారం పెద్దాపురంలో ఎంపీపీ లక్ష్మి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పుల్లయ్య, శ్రీనివాస్, రాజేంద్రలతోపాటు పార్టీలో చేరిన వారికి ఎంపీపీ కోటేరు లక్ష్మి కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరుపేదల అభ్యున్నతికి పనిచేస్తోందన్నారు. ఈ ఎన్నికలలో నందిగామ ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు భారీమెజార్టీతో గెలుపొందనున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి కన్నమాల సురేష్‌బాబు, నాయకులు శీలం లక్ష్మీప్రసన్న, సూర్యదేవర వినయ్, మండూరి గోపి, నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి



పార్టీలోకి చేరిన వారితో పద్మప్రియాంక

బూదవాడ నుంచి..

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన పరిటాల హుస్సేన్, వీరబాబు, నాగరాజు శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కుమార్తె పద్మప్రియాంక పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ విధానాలు నచ్చక తిరిగి వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన



నందిగామ: ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పట్టణంలోని కెవిఆర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతోపాటు డిస్ట్రిబ్యూషన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ పరిధిలోని 222 పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బందికి ఇక్కడ నుంచే సంబంధిత ఎన్నికల సామాగ్రిని అందజేయనున్నారు.కెవిఆర్ కళాశాలలో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం నియోజకవర్గ ఎన్నికల రిటరినింగ్ అధికారి ఎ.రవీంద్రరావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎండను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు



ఆర్వో వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా 222పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణ కోసం 266 ఈవీఎంలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఎన్నికల విధుల్లో 1780మంది సిబ్బంది పాల్గొంటున్నారని, ఇందుల్లో 20శాతం సిబ్బంది రిజర్వ్‌లో ఉంటారని చెప్పారు. జగ్గయపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేస్తామన్నారు.ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు పంపిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బంది లేకుండా షామియానాలు, మంచినీటిలో అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. పోలింగ్ రోజున ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే మరో ఈవీఎంను ఏర్పాటు చేసేలా ప్రత్యేకంగా సిబ్బంది ఆయా విధుల్లో ఉంటారన్నారు. ప్రతి రెండుగంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలుసుకునేలా ఎన్నికల కమిషన్ కొత్తగా ఓటర్ టర్న్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 89సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఆయా కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఆయా కేంద్రాల్లో వెబ్‌కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఓటింగ్ ప్రక్రియను తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోలు రూమ్ ద్వారా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఓటర్లంతా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆర్వో వెంకటేశ్వర్లు కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నందిగామ: ఎన్నికల వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు.ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి నందిగామ పట్టణంలో ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇంకు, వాటర్ బాటిళ్లు అనుమతించబోమన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లు, కండువాలు, జెండాలు, ఇతరత్రా ప్రచార సామాగ్రి పోలింగ్ కేంద్రానికి తీసుకురాకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. 144సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు అంతకుమించి ఎక్కువమంది ఒకేచోట గుమికూడటం చేయకూడదని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు. కవాతులో పలువురు ట్రైనీ ఐపీఎస్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించాలంటూ ప్రచారం



గంద్రాయిలో ప్రచారం చేస్తున్న నాయకులు



గోపినేనిపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

జగ్గయ్యపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను గెలిపించాలని కోరుతూ ఆపార్టీ నాయకులు ఆయా గ్రామాల్లో శనివారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనుమంచిపల్లిలో సర్పంచి పానుగంటి త్రివేణి నాయుడు, పోచంపల్లిలో బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, రామచంద్రునిపేటలో యలమద్ది రామకృష్ణ, వేదాద్రిలో సర్పంచి గుడారి పేరయ్య, గంద్రాయిలో సర్పంచి కొత్తపల్లి లూర్దుమేరి, కె.అగ్రహారంలో ఆవుల శ్రీనివాసరావుతోపాటు ఆపార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు మేలు జరుగుతుందని ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి అన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని గెలుపును కోరుతూ వత్సవాయిలో ఆపార్టీ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా నేరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా చిట్టేల, మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సర్పంచి భూక్యా సీతమ్మ, బాణావతు శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, సామినేని లక్ష్మీనారాయణ, కొండబోలు బ్రహ్మం, కాటేపల్లి రవి, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, అన్నెపాక నరసింహారావు, పార్టీ జిల్లా కార్యదర్శి గాదెల రామారావు పాల్గొన్నారు.

జగనన్న మరోసారి సీఎం కావడం ఖాయం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను గెలుపు కోరుతూ పట్టణంలోని 62వ పోలింగ్‌కేంద్రం పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఉదయభాను, ఎంపీగా కేశినేని నానిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈసందర్భంగా తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అందరూ అండగా నిలిచి ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోనున్నారని పేర్కొన్నారు.


నేడు దుర్గమ్మ సన్నిధిలో ఆదిశంకరాచార్యుల జయంతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఉదయం 8–30 గంటలకు ఆదిశంకరాచార్యుల విగ్రహానికి పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం ఆది శంకరాచార్యుల విగ్రహంతో నగరోత్సవ సేవ జరుగుతుందని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది.

వేసవిలో గోవులపై ప్రత్యేక పర్యవేక్షణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):పెరుగుతున్న ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఉన్న గోవులు, దూడలకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు వాటి పర్యరక్షణకు చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలను ఈవో రామరావు శనివారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం ఆవరణలో ఉన్న రెండు గోశాలలోని ఉన్న దూడల పరిశీలించారు. గోవులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా గోశాలలో ఫ్యాన్‌తోపాటు కూలర్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు ఆలయ అధికారులు వివరించారు.

అలరించిన వీణ వాద్య కచేరీ



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత మూర్తి త్రయంలో ఒకరైన శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామివారి జయంతి సందర్భంగా సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం సంగీత సమితి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత వైభవాన్ని చాటింది. సమితి విద్యార్థినులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలను వీణపై పలికించారు. సమితి ప్రధానకార్యదర్శి సీవీ రావ్ మాట్లాడుతూ కర్నాటక సంగీతంలో ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజస్వామిలను మూర్తిత్రయం అంటారని తెలిపారు. బాలబాలికలను ప్రోత్సహించేందుకు జాతీయస్థాయిలో ఏటా సంగీతపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.